క్లుప్తంగా

నేడు సచివాలయం ప్రారంభం

మక్కువ: మండలంలోని చప్పబుచ్చమ్మపేట, సరాయివలస, పనసభద్ర గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ దేవ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన



ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఈఎన్‌సీ శ్రీనివాస్

మక్కువ: మండలంలోని అనసభద్ర గ్రామ సమీపంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏకలవ్య పాఠశాలను ఈఎన్‌సీ ఎస్.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. రూ.12 కోట్లతో నిర్మించిన ఈ పాఠశాలను ఈనెల 14న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆ ఏర్పాట్లను పరిశీలించిన ఈఎన్‌సీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవకుమార్

మక్కువ: మండల కేంద్రం మక్కువ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పి.దేవకుమార్ సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. ఎండలు పెరుగుతున్నందున మంచినీటిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ ఈశ్వరమ్మ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం



జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక రాయగడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని (జనరిక్ మెడికల్ షాప్) ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వి. చిన రామినాయుడు, డైరెక్టర్ అంబటి రాధా కృష్ణంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపారపు సత్యనారాయణ, సెక్రటరీ ఎస్. నారాయణరావు, మండల, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు



తోణాం ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న జీసీసీ డీఎం మహేంద్ర

సాలూరు: తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జీసీసీ డీఎం మహేంద్ర సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షలంటే భయం వీడాలని, ప్రణాళికతో ప్రిపేర్ అయితే మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కోరారు. అంతకుముందు పట్టణంలో ఉన్న జీసీసీ గోదాంను పరిశీలించారు. గోదాంలో ఉన్న రేషన్ సరుకులు, హాస్టల్స్‌కు పంపిణీ చేయాల్సిన సరుకులు, వాటి స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు.

వాహనాల తనిఖీ

సాలూరు: వాహన చోదకులు వాహన సంబంధిత రికార్డులను కచ్చితంగా కలిగి ఉండాలని సీఐ దేముడుబాబు అన్నారు. పట్టణంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన ధ్రువపత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధిలో మేటి గాదెలవలస..



నాడు - నేడు నిధులతో పూర్తయిన ఉన్నత పాఠశాల అదనపు భవనాలు

- గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు
- రూ. 55 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు
- రూ. 20 లక్షలతో జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు
- రూ. 63 లక్షలతో మంచినీటి సౌకర్యం
- గ్రామాభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



జగనన్న కాలనీలో ఇళ్లు



సీతానగరం: జగనన్న పాలనలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గాదెలవలస ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. అటువంటి గ్రామం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎంతో అభివృద్ధి చెందింది. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను లక్షలాది రూపాయలతో నిర్మించడంతో గ్రామంలోనే అన్ని సేవలు లభిస్తున్నాయి. అలాగే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడంతో చదువు పట్ల విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు అవసరమైన అదనపు భవనాలను సైతం నిర్మించారు. అలాగే గ్రామ సమీపంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం కూడా చేశారు. దీంతో జగనన్న కాలనీ ఎంతో సుందరంగా రూపుదిద్దుకుంది. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో విడుదల కావడంతో.. గ్రామంలో సామాజిక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే చొరవతో..

గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలు సమస్యలను గుర్తించారు. వెంటనే రూ. 20 లక్షలతో సీసీ కాలువ, రోడ్డు వేయించారు. మరో 55 లక్షల రూపాయలతో మరికొన్ని కాలువలు, సీసీ రోడ్లు వేశారు. అలాగే జల్‌జీవన్ మిషన్ నిధులు రూ. 63 లక్షలతో చేపడుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో కోటీ 57 లక్షల రూపాయలతో అదనపు భవనాలు నిర్మించడంతో మౌలిక వసతులు కల్పించారు.



గాదెలవలస సచివాలయం

హర్షణీయం



అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం హర్షణీయం. అధికారులందరూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించారు. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలోనే అన్ని పనులు జరిగిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకేలో లభిస్తున్నాయి. జగనన్న చేసిన అభివృద్ధిని మరువలేం.

– బొన్నాడ అన్నపూర్ణ, సర్పంచ్, గాదెలవలస

ఇళ్ల నిర్మాణాలు పూర్తి..



గాదెలవలస సచివాలయం పరిధిలో 80 కుటుంబాలున్న ఉన్న ఎస్ఎస్ పురంలో అర్హులైన పేదలకు జగనన్న ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతులమీదుగా సామూహిక గృహప్రవేశాలు కూడా జరిగాయి. లబ్ధిదారులు జగనన్న రుణం తీర్చుకోలేమని చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉంది.

– నమ్మి దుర్గమ్మ, సర్పంచ్, ఎస్ఎస్‌పురం



రైతుభరోసా భవనం



గ్రామంలోని సీసీ రోడ్డు



నేడు నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు భవనం

సొంతింటి కల సాకారం



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పురపాలక సంఘ పరిధిలో 22వ వార్డుకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ అందరి ఆశను నెరవేర్చిన సీఎం జగనన్న మరో అడుగు ముందుకేసి ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని చెప్పారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు కోడిగుడ్ల రవి కుమార్, స్థానిక కౌన్సిలర్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన మారడాన ఎల్లంనాయుడు, రేష్మ దంపతుల కుమారుడుకి ఇటీవల వైద్యం చేయించారు. అయితే వారిది పేద పరిస్థితి కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో సీఎం సహాయ నిధి నుంచి రూ. 70,000 మంజూరుకావడంతో ఆ చెక్కును ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గులిపిల్లి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు సభ్యులకు చదివి వినిపించారు. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భద్రగిరి సీహెచ్‌సీలో మినీ బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, సీహెచ్‌సీ నుంచి రిఫరల్ కేసుల సంఖ్య తగ్గించి, సాధ్యమైనంత వరకు స్థానికంగానే వైద్య సేవలను అందివ్వాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతీ నెలా బియ్యం మాత్రమే ఇస్తున్నారని, పప్పు, పంచదార వంటి నిత్యావసర సరుకులు ఇవ్వడం లేదని, బయోమెట్రిక్ వేయిస్తున్నప్పటికీ ఏ నెలకానెల బియ్యం ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే జీసీసీ, వైకేపీ, వీడీవీకేల ద్వారా జీడి పిక్కలను కిలో రూ.200లు చొప్పున, పిక్కతో ఉన్న చింతపండు కిలో రూ.60, పిక్క తీసిన చింతపండు కిలో రూ.120 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. మూతపడిన పి.ఆమిటి, దుమ్మంగి, బొద్దిడి గ్రామాల్లోని ద్రవ్య సహాయక పాఠశాలలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంఈఓ బి.చంద్రశేఖర్ తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకంపై ఆసక్తి కనబరిచే లబ్ధిదారులకు రూ.50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు వైకేపీ ఏపీఎం తెలిపారు. అలాగే పిండి మిల్లులు పెట్టుకునేందుకు ఆసక్తి కలిగిన లబ్ధిదారులు తమను సంప్రదించాలని ఏఓ సీహెచ్ ప్రసాద్ కోరారు. భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారిణి త్రివేణి మాట్లాడుతూ.. గుండె రోగుల కోసం స్టేమీ ప్రోగ్రాంను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, రోగులు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేయూతకు సన్నాహాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణీంద్రకుమార్

సాలూరు రూరల్: ఈనెల 15-20 తేదీల్లో జగనన్న చేయూత కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ తెలిపారు. చేయూత కార్యక్రమ ఏర్పాట్లపై వెలుగు ఏపీఎం జి.సింహాచలంతో సోమవారం చర్చించారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి అర్హులైన మహిళలకు జగనన్న చేయూత పథకం కింద ప్రభుత్వం రూ. 18,750లు అందిస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత మహిళలతో సమావేశాన్ని నిర్వహించి వారి ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు చేపట్ట నున్నట్లు చెప్పారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-1 సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ -1 సామల సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ముందుగా ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ గదులు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉందని, ఇంటి దగ్గర కూడా సమయం వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వరప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యసేవలు

గరుగుబిల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించారు. ఓపీ రికార్డును పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, వారికి అందించిన చికిత్స, మందుల వివరాలను తనిఖీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తరుచూ తక్కువగా ఉంటున్న మహిళలకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించుకోవాలి

- ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. పురపాలక సంఘ పరిధిలో గల 16వ నంబర్ పోలింగ్ బూత్ 11,12 వార్డుల పరిధిలో గల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికలు మనకు చాలా కీలకమన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచేలా చైతన్య పరచాలన్నారు. జగన్న విజయం కోట్లాది మంది పేద ప్రజల భవిష్యత్‌తో ముడిపడి ఉందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపల్లి బాలకృష్ణ, మంత్రి రవికుమార్, గొర్లి మాధవరావు, తాడ్డి శంకరరావు, కోరాడ శ్రీనివాసరావు (నాని), బొంగు చిట్టిరాజు, జలాల్, షేక్ షఫీ , తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సత్కారం



సీఐ జి.దేముడుబాబును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: సారా మహమ్మారిపై ఉక్కుపాదం మోపి పట్టణంలో సారా శాశ్వత నివారణకు కృషి చేస్తున్న సీఐ జి.దేముడుబాబుకు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ దేముడుబాబును ఘనంగా సన్మానించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సారా తయారీ, రవాణ, విక్రయాలను అరికట్టేందుకు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సీఐ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పువ్వల శ్రీను, బవిరెడ్డి ప్రసాద్, ప్రవీణ్, బాలకృష్ణ, యశోద కృష్ణ, అప్పలస్వామి, మధుసూదనరావు, వెంకటరమణ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ శివకుమార్

సీతానగరం: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం మనం జిల్లా ఎంవీఐ ఎం. శివకుమార్ అన్నారు. రవాణా భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సీతానగరం హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐలు ఎస్. రమేష్‌కుమార్, జి. సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడుతూ, వాహనాలు తీసే ముందు వాటి కండీషన్ తెలుసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని.. కారు డ్రైవింగ్ చేసేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం నిబంధనలు పాటిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చినభోగిలి, సీతానగరం, అజ్జాడ గ్రామాలకు చెందిన డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎస్ సీఐలు

పార్వతీపురం టౌన్: నేరాల అదుపునకు సహకరించాలని సీసీఎస్ సీఐలు ఎం. అప్పారావు, సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో జ్యువెలరీ షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దుకాణాల్లో నైట్‌విజన్ సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. దొంగ బంగారం , వెండి వస్తువులు కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ ఎస్సైలు రమణారావు, రమణారెడ్డి, పార్వతీపురం టౌన్ ఎస్సైలు సంతోషి, రవీంద్రరాజు, బంగారు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

బల్లకృష్ణాపురంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురంలో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈఓ పీఆర్‌డీ కె. కుమారవర్మ సూచనల మేరకు సర్పంచ్ నడిమింటి సుశీల ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తీత పనులు సోమవారం చేపట్టారు. పనులను పర్యవేక్షించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాలువల్లో పూడికలు నిండిపోవడంతో దోమలు వృద్ధి చెందాయన్నారు. దీంతో పారిశుధ్య పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు చెప్పారు. అలాగే గ్రామంలో వలంటీర్ల సహకారంతో బోదకాలు వ్యాధి నివారణకు రాత్రి పూట రక్త పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్ల జగన్నాథం, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత వైఎస్సార్‌సీపీలోకి చేరుతోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం జమదాల గ్రామమానికి చెందిన టీడీపీ నాయకులు, గ్రామ యువత సోమవారం ఎమ్మెల్యే అలజంగి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, జిల్లా జనరల్ సెక్రెటరీ వి. గురురాజు, సీనియర్ నాయకుడు యాళ్ల ఈశ్వరప్రతాప్, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, భూపతి శేఖర్, యాళ్ల శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.